


[గత సంచిక తరువాయి]

లారీ క్రింద పడగా చెల్లెలి మొగుడు నారాయణ రావుకు బాగా దెబ్బలు తగిలాయనీ, ఆస్పత్రిలో వున్నాడనీ తెలిసినా, రాజ్యలక్ష్మిలో ఆవంత చలనంకూడా కలుగలేదు. 'అయ్యో! ఎంత పని జరిగింది! చెల్లెలి శారద మాంగల్యం ఏ మవుతుందో!' అని కొంచెం కూడా అదుర్దా అగుపర్చలేదు. ఆలకించీ ఆలకించ నట్టు పూరుకుంది. భర్త వెంకట్రాయుడే గబగబా వెళ్ళాడు చూసి రావడానికి. వచ్చాకనైనా ఆమె నోరెత్తి 'ఆయనగారికి ఎట్లా ఉంది?' అని అడగ లేదు. వెంకట్రాయుడే వివరంగా చెప్పాడు. అప్పటికీ ఆసక్తి అగుపర్చలేదు.

రాజ్యలక్ష్మి దైనిక జీవనంలో ఎంతో మార్పు వొచ్చింది. మానసికంగా కూడా ఆమెలో అకస్మాత్తుగా వొచ్చిన మార్పులు అందరికీ అర్థమవుతూ రాసాగాయి.

రాజ్యలక్ష్మి భోజనం సరిగ్గా చేయడం లేదు. ఇరుగూ పొరుగూ స్త్రీల మీద, వాళ్ళకబుర్ల పట్ల, మంచి చెడ్డల మీద, ఏమీ ఆసక్తి చూపటంలేదు. ఎవ్వరు ఏంచెప్పినా వినిపించుకున్నట్టే నటించదు.

నిత్యమూ తులసి పూజ మానివేసింది.

భగవద్గీత పారాయణం లేదు.

పురాణ శ్రవణమూ, సీతారామ నామ సంకీర్తనమూ, ఆధ్యాత్మిక చింతనా—లేవు.

నిత్య జీవితంలో ఎంతో పరిచయం గల వ్యక్తులనే పలుకరించదు, వాళ్ళే పలుకరిస్తే క్రొత్తగా చూస్తుంది.

ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటుంది.

ఆ ఆలోచన ఎవర్ని గురించో, ఎందుకో, అంత అగత్య మేమిటో—చెప్పదు.

అప్పుడప్పుడూ తనలోతానే నవ్వుకుంటుంది.

ఏదైనా నవ్వుకుంటూ ఉంటే—బాధగా చూస్తుంది.

భర్త వెంకట్రాయుడితో కూడా మనసిచ్చి మాట్లాడదు. అడిగేదానికి 'ఊ!' 'ఆ!' అనటం మినహాయించి వివరంగా సమాధానం చెప్పదు.

చెల్లెలి కూతురు బారసాలకు వెళ్ళలేదు.

చెల్లెలు వ్రాసిన ఉత్తరాల వంకే చూడలేదు.

చెల్లెలి భర్తకు అంత ప్రమాద పరిస్థితి ఏర్పడ్డా వెళ్ళి చూసి రాలేదు.

ఆమె ముఖం ఎప్పుడూ తీరని శోకంతో బాధ పడుతున్నట్టు, కుటుంబ సమస్యల గురించి ఆలోచిస్తున్నట్టు— ఉంటుంది.

రాజ్యలక్ష్మి ఎంతో చిక్కిపోయింది.

ఆమె ముఖంలో నిత్యనూతనమైన జీవకళ నశ్శించింది. ఆమె కళ్ళల్లోని శోభ తగ్గింది. శారీరకంగా ఆమెలో ఎంతో మార్పు వొచ్చింది.

రాజ్యలక్ష్మి ఎవ్వరికీ అర్థం కావడం లేదు. భర్త, అత్త, ఇరుగూ, పొరుగువారు, వూళ్ళోవాళ్ళ— ఎవ్వరూ ఆమెనీ, కడుపులోని దుఃఖాన్నీ, హృదయపు లోతునీ— అర్థం చేసికోలేక పోతున్నారు. రాజ్యలక్ష్మికి నెల తప్పిందని తెలియగానే భర్త ఎంతో ఆనందపడ్డాడు. అత్తయ్య ఎంతో మురిసిపోయింది. ఇరుగూ పొరుగూ అమ్మలక్కలు ఎంతో సంబర పడ్డారు. రాజ్యలక్ష్మి పూజలకు దేవుడు కరుణించి నలుసును కలిగించా డనుకున్నది. కాని రాజ్యలక్ష్మి ఆనందపడలేదు. పైపెచ్చు ఆమె ఆలోచనలతో కృశించ నారంభించింది. ఆమెలో కలిగిన మార్పు ఎవ్వరికీ అర్థం కావడం లేదు. కాపురానికి వొచ్చిన ఇన్నేళ్ళకు గర్భం కావడం వల్ల ఆమె ఇట్లా అవుతూన్న

శ్రీ [illegible] నాగేశ్వరరావు

దని అమ్మలక్కలు కొందరు చెప్పగా, వెంకట్రాయుడు డాక్టరుకు చూపించాడు రాజ్యలక్ష్మిని. డాక్టరు కొన్ని ఇంజక్షన్లు, టానిక్‌లూ ఇచ్చాడు. కాని వాటివల్ల ఏం ఫలితం అగుపడలేదు. రాజ్యలక్ష్మి అట్లానే కృశించిపోతూ ఉన్నది.

భర్త వెంకట్రాయుడు గాబరా పడ్డాడు. భార్య ఎందుకు అట్లా బాధ పడుతున్నదో, ఎందువల్ల లోకాన్ని నిర్లక్ష్యంగా చూస్తున్నదో, ఎందుచేత భగవత్సేవ మానివేసిందో, ఎందువల్ల కృశించి పోతుందో కనుక్కునేందుకు ఎంతో ప్రయత్నించాడు కాని లాభం లేకపోయింది.

తను చేసిన పాపానికి ఫలం కలుగబోతుంది. తను పెంచుకున్న పాపం ఒక రూపాన్ని ధరించబోతుంది. అవినీతి వల్ల ఏర్పడే సంతానాన్ని తను లోకం ఎదుట పెడుతోంది. 'గుమ్మడి పండు లాంటి పాపాయి' అనుకుంటారు ఆయనగారు. 'ఎన్నో పూజలూ, వ్రతాలూ, ఉపవాసాలూ చేసి, సంపాదించిన పుణ్యంలో పుట్టిన రత్నం'— అనుకుంటారు వూళ్ళోవాళ్ళు. కాని తను ఏమనుకుంటుంది? తన అంతరాత్మ ఏమంటుంది? కట్టుకున్న భర్తనీ, వ్యక్తిగా గౌరవించిన లోకాన్నీ, మోసగించ వచ్చా? భగవంతుడు క్షమిస్తాడా?—

ఈ విషయం మీదే రాజ్యలక్ష్మి అట్లా కృశించి పోయింది. ఈ విషయాన్ని గురించి ఆలోచిస్తున్నా అన్నం తినడం మానివేసింది. భగవంతుని కైంకర్యాన్ని మర్చిపోయింది. దైనికచర్యల్ని తృణీకరించింది.. పాపభీతికీ, అంతరాత్మకూ ఆమెలో అనుక్షణమూ సంఘర్షణ జరుగుతూనే ఉన్నది.

సంఘర్షణ అట్లా సాగుతూ ఉండగానే రాజ్యలక్ష్మికి నవ మాసాలూ నిండినయ్.

చెల్లెలు శారద అక్క పురుడుకు సాయపడాలని వచ్చింది.

కాని శారద వంక ధైర్యంగా తలయెత్తి చూడ లేకపోయింది రాజ్యలక్ష్మి. ఆమెతో మనసిచ్చి మాట్లాడలేకపోయింది.

"ఎందుకు అక్కా నా మీద ఇంత ఆగ్రహం వహించావు? నేనేం తప్పు చేశాను? ఎన్ని ఉత్తరాలు వ్రాసినా సమాధానం ఇవ్వలేదు....." అని శారద అనగా ముఖం క్రిందికి దించి మెదలకుండా వూరుకుంది.

కనే రోజులు దగ్గర పడుతూన్నకొద్దీ రాజ్యలక్ష్మిలో అశాంతి ఎక్కువైంది. బ్రతుకు మీద జుగుప్స, పాప భీతి, దిగులూ—అధికమైనాయి.

......... ఈ జన్మకు తనకు సంతాన యోగం లేదు. పూర్వజన్మ కర్మానుసారంగా తనకు ఈ జన్మలో సంతానప్రాప్తి లేదు. ఆ విషయం తనకు తెలుసు. లోకం కూడా అట్లానే భావించింది. కాని తను గర్భవతి అయింది. తను చేసిన పూజలూ, ఉపవాసాలూ ఫలించాయనీ, దయామయుడైన భగవంతుడు కరుణ వహించాడనీ లోకం అనుకుంటోంది. కాని వాస్తవం ఏమిటి? తను చేసిన పూజలూ, వ్రతాలూ, ఉపవాసాలూ ఫలించాయా? దయాస్వరూపుడైన భగవంతుడు తనమీద కరుణ వహించాడా?? తను అట్లా ఆత్మవంచన చేసికోగలదా?

తను కేవలం సంతాన ప్రాప్తి కొరకే పూజలూ, వ్రతాలూ, ఉపవాసాలూ చేయలేదు. ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోలేదు. 'సర్వం విష్ణుమయం' అని నమ్మలేదు. లౌకిక సుఖాసక్తమైన మనసును కట్టుదిట్టం చేసి, స్వార్థం విడిచి, రాగ ద్వేషములకు స్వస్తి చెప్పి, భగవంతుని యందు చిత్తము నుంచి అంతఃకరణ వృత్తిని పరిశుద్ధి చేసికొని పరార్థసాధనే పరమార్థంగా భావిస్తూ, సత్య సంగ్రహణార్థమై సేవ చేస్తూ, అరిషడ్వర్గాన్ని సంపూర్ణంగా అదుపులో నుంచి, కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గముల ద్వారా గమ్యస్థానం చేరేందుకు జీవిత కాలంలో ప్రయత్నించుటయే జన్మ సాఫల్యానికి ప్రధాన సూత్రమని విశ్వసించింది. గీతలో శ్రీ కృష్ణభగవానుడు చెప్పినట్టు "నాయందు చిత్తము నుంచి నాయందు దాసక్తులై సకల కర్మలను నా కర్పించి, ఏకాంతయోగయుక్తులై నన్ను ధ్యానించుచు సేవించెడివారల జనన మరణ రూపమైన సంసారసాగరము నుండి నేను శీఘ్రముగానే ఉద్ధరించుచున్నాను." అట్లా సేవించెడివారికి ఈ 'జన్మ' అనేది లేకుండానే పోతున్నది.

కాని తను ఈ ఆధ్యాత్మిక చింతలో, పారమార్థిక చింతలో, 'దేవుడు ఉన్నాడు.' అని నమ్మి, అట్లా

పవిత్ర జీవితాన్ని అర్పించిన నాళ్ళు పొందిన పరాభవ్ని కదా? పవిత్ర భజింపుటతో ఒక్క మెట్టు కూడా యెక్కలేక పోయింది. మోక్షమార్గం తో కాదు కూడ లేకపోయింది. భగవంతుడు తనను మాత్రమేన్ని దాసిపెట్టలేదు. 'ఈ జన్మకు నీకు సంతానం లేదు' అని నుదుటు మీద లిఖించాడు. దాని తను భగవంతుని దాతను తప్పించడానికి పరిస్థితుల్ని చెప్పినట్టుంది. అవినీతికి లొంగి, పాపకార్యాన్ని చేసి, గర్భవతి యై భగవంతుని వ్రాతను వమ్ముచేసింది. ఇంతకంటే ఘోరమైన పాపం మరొకటి ఉంటుందా? ఇది క్షమార్హమైన అవినీతి కార్యమేనా?

ఇంత ఘోరమైన పాపం చేసి, ఇన్నాళ్ళూ నిక్కి బ్రతికింది? ఎందుకు బ్రతికింది? ఈ సమ్మె తన శేష జీవితానికి చుట్టుకోదా? తనని భగవంతుడు శిక్షిస్తాడు.

—తను లొంగిన అవినీతికి, అందువల్ల కలిగిన ఫలితానికి భగవంతుడు శిక్ష విధిస్తాడు!

తనకు కొద్ది రోజుల్లో కలుగబోయే సంతానం బ్రతక్కపోవచ్చు! పుట్టగానే, పురిట్లోనే చావొచ్చు! —లేదా కుంటివాడో, గుడ్డివాడో, అష్టావక్రుడో కావొచ్చు!

వాడు బ్రతికితే తన జీవితానికి శాశ్వతంగా చుట్టుకోవచ్చు! తన జీవితాన్ని అస్తవ్యస్తం చెయ్యవచ్చు! తన జీవితంలో సుఖం, శాంతి లేకుండా చేయడానికి కంకణం కట్టుకోవచ్చు!

తన పాపానికి శిక్ష పడుతుంది.

తన నేరానికి శాశ్వతంగా సంకెళ్ళు పడతాయి!

భగవంతుని ఎదుట, మాయా మానుష స్వరూపుని ఎదుట—పాపాత్మ మానవు లెంత?

రాను రాను రాజ్యలక్ష్మి ఆలోచనలు ఆ స్థితికి పోయాయి.

*

ఆరోజు పున్నమి, శనివారం. తెల్లవారు జామున మూడున్నర గంటలకు బావగార్ని శారద నిద్రనుండి లేపి 'గొల్లపాలెం వెళ్ళి మంత్రసాని మంగమ్మను తీసుకుని రండి! అక్కయ్యకు నొప్పులు ఆరంభమైనాయి—' అన్నది.

వెంకట్రాయుడు చేతికర్ర తీసుకొని గబగబా వెళ్ళాడు గొల్లపాలెం కేసి.

మంత్రసాని మంగమ్మ వచ్చింది.

కాని కూడా ప్రక్కనే ఉన్నది.

ప్రక్క ఇంటి పార్వతమ్మ, ఎదురింటి వెంకాయమ్మ కూడా సాయంగా వచ్చారు.

ఎంతో బాధ మీద— రాజ్యలక్ష్మి మగపిల్లవాణ్ణి కన్నది, శనివారం తెల్లవారుజామున అయిదుగంటల పది నిమిషాలకు కన్నది.

"చక్కని చందమామ లాంటి పిల్లవాడు." అన్నది ప్రక్క ఇంటి ఇల్లాలు పార్వతమ్మ.

"ఎంతో పుణ్యాన్ని సంపాదించి పుట్టిన బంగారు కొండ." అన్నది మంత్రసాని మంగమ్మ.

పురిటి గదిలోంచి బయటకు పరుగెత్తింది శారద బయట శుభవార్త కోసం సెకండ్లను లెక్క పెడుతున్న బావగారితో చెప్పడానికి.

రాజ్యలక్ష్మి తృప్తిగా నవ్వుకుంటూ—'పాపఫలం' అని గొణిగింది.

మంత్రసాని మంగమ్మ, ఇంటి ప్రక్క ఇల్లాలు పార్వతమ్మ, ఎదురింటి ముత్తయిదువ వెంకాయమ్మా—అక్కళ్ల ముఖం వాళ్ళు వింతగా చూసుకున్నారు.

పిల్లవాడు కలిగి ఇంకా ఇరవై నాలుగు గంటలు నిండలేదు. రాజ్యలక్ష్మికి చక్కని చందమామలాంటి కొడుకు కలిగాడంటే— ఊరికే పండుగగా ఉంది. అమ్మలక్కలు చేస్తున్న పనుల్ని ఆపి— వెళ్ళి చూడ నారంభించారు.

కాని, తల్లి ఆరోగ్యం బాగుండలేదు.

తల్లి పిల్లవాని కేసి కన్నెత్తి చూడలేదు.

అది గమనించిన వాళ్ళు నోటిమీద చేతులు పెట్టుకొని ఆశ్చర్యపోతున్నారు.

రాజ్యలక్ష్మి ఆరోగ్యం ఆ రాత్రికి మరీ విషమంగా ఉన్నది.

తనకి చక్కని పుత్రుడు కలిగాడని అంతా చెప్పుకుంటున్నారు. మరి తనని భగవంతుడు శిక్షించలేదా? కుంటివాణ్ణో, గుడ్డివాణ్ణో—ఎందుకు ప్రసాదించలేదు. పాపానికి ఫలితమే లేదా? భగవంతుడు తనని క్షమించాడా?—అనుకుంది రాజ్యలక్ష్మి.

రాజ్యలక్ష్మికి వాతజ్వరం అన్నాడు ఆ ఊరి నాటు వైద్య శిఖామణి పంచి నారాయణాచార్యులుగారు. బాలింతలో వచ్చింది కనుక అది 'సన్నిపాత జ్వరం' అని ఆయనే మరో క్షణాన నిర్ధారణ చేశాడు. శక్తి కొలది వైద్యం చేసి, దైవానుకూలత ఉన్నట్టైనా కలకు రాజ్యలక్ష్మిని మామూలు మనిషిగా చేస్తానని వాగ్దానం చేశాడు.

కాని ఏం ప్రయోజనం లేకపోయింది.

ఆ రోజు తెల్లవారుజామున భర్తతో గద్గదిక స్వరంతో అన్నది రాజ్యలక్ష్మి.

"నా జీవితం ఇట్లా ఎందుకైందో నాకు అర్థం కాదు. ఒక దుష్ట శక్తిని ఎదుర్కొనే పటుత్వం లేక, పరిస్థితుల తాత్కాలిక ప్రాబల్యానికి లొంగిపోయి నా బ్రతుకును ఇట్లా తెల్లవార్చుకుంటున్నాను. మన దాంపత్య జీవితంలో భర్తగా మీరు ఎంతో ఆదర్శంగా ప్రవర్తించారు. భార్యగా నాకు తగిన విలువల్ని యిచ్చి, పోషించారు. కాని నేను.... నేను.... మీ ఆదర్శ సతిగా..... విలువను నిలబెట్టలేక పోయాను. నా జీవితం ఇట్లా ఆఖరు దశకు రావటానికి—హృదయ పూర్వకంగా నేను ఏ పాపమూ చేయలేదు. పైబడి చుట్టుకొన్న పాపాన్ని పారద్రోలే శక్తిని, సత్తువని కలిగి ఉండకపోవటమే నా పాపం!.... మీరు...మీరు...." ఆ పైన మాట్లాడ లేకపోయింది రాజ్యలక్ష్మి.


ఆ రోజు ఉదయభానుడి శ్వేత కిరణాలు చూసే భాగ్యానికి రాజ్యలక్ష్మి నోచుకోలేకపోయింది. బాగా తూర్పు రేఖలు విచ్చుకోనకముందే రాజ్యలక్ష్మి శాశ్వతంగా కన్ను మూసింది.

ఆ గ్రామంలో రాజ్యలక్ష్మి చావుకు కంట తడి పెట్టని ప్రాణి లేదు.

ఆ ఇల్లు దుఃఖాంబుధిలో సముద్రంలో నావ రీతిగా తేలుతూంది.

ఆ ఇంట్లో చీకటి రాజ్యమేలే అధికారాన్ని చేపట్టింది.

(సమాప్తం)



హైద్రాబాద్ బ్రాంచి: సుల్తాన్ బజారు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హైద్రాబాద్ ఎదురుగా (దక్కన్)